


# ప్రకృతి పరిష్కారం

రోజులకు ముందు "ఆ", "ఈ" తగులుస్తూ వుంటాం; ఏరోజులు అయినా ఒక్కటే! స్థిరాస్తి ఒక సెంటు వున్నా, చరాస్తి ఒక ఇత్తడి పాత్ర వున్నా, లేక ఒక వంద ఎక రాల భూమి, పట్నంలో నాలుగు మేడలూ, బోలెడు రొఖ్ఖం నిల్వ వున్నా తగవుల దృష్ట్యా ఒక్కటే! పందిరపట్టిమంచం కోసం తగవుపడి, ప్రాణావశిష్టులై ఆసు పత్రులలో చేరిన భాగ్యవంతులు వున్నారు. కాలిగట్టుకోసం నరుక్కున్న భూ ఖామందులున్నారు. అంచేత బుద్ధిమంతులు ఏ రూపంలో, ఎంత వున్నా 'డబ్బు' పాపిష్టిది అంటారు. తండ్రీ కొడుకుల్నీ, భార్యా భర్తల్నీ, తల్లీ పిల్లల్నీ, అన్నదమ్ముల్నీ, స్నేహితుల్నీ వేరుచేసేది తరుచు అదే!

ఇది ఎందుకు చెప్పవలసివచ్చిందంటే జానకిరామయ్య ఇంటివాటామీద వాలిన

## గాడేపల్లి సీతారామయ్య

కాకి, స్నేహితుడూ, వ్యాపారంలో వాటా దారూ అయిన గోవిందసెట్టి వాటాభాగం మీద ఎక్కడా వాలటానికి వీల్లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. అదంతా గొడవల సంపుటే!—

నేను చేరబడి రెండు రోజులయ్యాక, గోవిందసెట్టి తండ్రి, వీరభద్రయ్యసెట్టి, "మీకు పోయిన నెల జీతం ఎంత రావాలో ఏటో లెక్కకట్టండి" అన్నాడు గుమాస్తా జానకిరామయ్యతో.

"లెక్క మొన్ననే కట్టేనండి; అయిదు రూపాయల పావలా సామాను వాడుకున్నా నండి గత నెలలో......నాల్గవ నేదీన ఒక వీసెడు బెల్లం..." అని తన ఖాతా తిరుగ వేసి వివరాలు చెప్పబోయాడు.

"ఇవరాలు అబ్బాయి గోవిందు చూస్తాడు లెండి. మీదగ్గర అట్టాంటి పొరపాట్లు వుండ వనేగా పరకు ఖరీదుకు కూడా మిమ్మల్నే ఎల్లమంటా ఉంట. అయితే మీకు తొమ్మిదీ ముప్పావలా వస్తాదన్నమాట; ఖర్చు రాయండి తెస్తాను" అన్నాడు పాత కాలంగా బొజ్జ నిమురుకుంటూ, వ్యాపార ధోరణిలో.

"నేను రెండునెలల క్రితం జీతం సరి పోవడంలేదు, మూడు రూపాయలు ఎక్కువ చేయమనికోరితే మీరు 'చూద్దాంలెండి వచ్చేనెల' అన్నారు. పోయిన నెల మీకు జ్ఞాపకం చేద్దామనుకున్నాను. మీరే ఎక్కువ చేస్తానని అన్నారుకదాఅని వూరుకున్నాను.



మధురానగరి దారిలో...

—చిత్రకారుడు: సి. రాధామోహన్.]

# ★ ప్రకృతి పరిష్కారం ★

మీరు మరచిపోయినట్లులేదు; ఈ నెలన్నా ..." అని నీళ్ళు నమిలాడు జానకిరామయ్య.

"ఏటోనండి; ఇత్తానన్నాననుకోండి. వ్యాపారం ఈసురోమంటా వుండాది. నెలయి కొన్న చింతపండు సరుకు చూడండి ఇదుద లయిందేటో. జీతం ఎక్కువ చేయమంటే ఏటిచేసేదికి ఏటో మీకూ, మాకు కలిసింది కాబట్టి కాని, లేకపోతే గుమస్తా కావాలే టండీ ఇంతోటి వ్యాపారానికి" అన్నాడు సెట్టి అసలు ఉద్యోగానికే ఎసరు పెట్టేస్తూ.

జానకిరామయ్య హృదయం ఉద్వేగంగా కొట్టుకుంది. మనస్సులో 'గుమస్తా కావాలే టండీ' అన్న సెట్టిమాటలు పదేపదే ప్రతిధ్వనించాయి. దిగులుతో క్రుంగిపోయాడు. "ఇదీ లేకపోతే ఇంక ఏమైనా వుందా?... ఇదీ లేకపోతే ..." అప్రియమైన ప్రతీ విషయాన్ని మానసికంగాబహిష్కరించాలని ప్రయత్నించడం లోకసహజం. అదే జానకి రామయ్యచేసినదీను.అయినా బాధతప్పలేదు. తన మనస్సును సంబాళించుకునేటప్పటికి తలప్రాణం తోకకు వచ్చినట్లు అయింది ప్రాధేయపూర్వకంగా – "అవుననుకోండి. మీధర్మమాఅంటూ నన్ను ఒకఇంటివాడినిగా కూడా చేశారు; మరచిపోలేదు. నాకూ, నా భార్యకు సరిపోవడంలేదు మీరు ఇచ్చే జీతం అని మనవిచేసుకుంటున్నాను. ఎలాగైనా..." అంటుండగా,

సెట్టి అర్థోక్తిలోనే అందుకుని "ఏటో, వచ్చేనెల చూద్దాం లెండి". అన్నాడు వ్యాపారస్తులు వాయిదా వేసే సహజ స్వభావంతో.

జానకిరామయ్యకు సెట్టి జీతం రాళ్ళు కడిగివేసి మరీ ఇస్తూ వున్నట్లు తోచింది. అయినా మారు మాటాడలేకపోయాడు. దానికి ప్రధానకారణం సెట్టిచేసిన ఉపకారాలు అతని స్మృతిపథంలో పాతాడటం. ఆ ఉపకారాలకు అతను ఎప్పటికీ కృతజ్ఞుడే!

జానకిరామయ్య స్వగ్రామం కోనసీమలో ఒక లంక. తల్లి పోయిన మరుసటి సంవత్సరం తండ్రి మరణించాడు. ఆ తండ్రి పిత్రార్జితం బాపతు ఎనిమిదిఎకరాల మాగాణి, తెగనమ్మి పేకాటలు ఆడి పూర్తిగా కరారావుడి పెట్టేశాడు. ఇంత తిండీ, బట్టా పెట్టి ఆదరించే 'నా' అనే వాళ్ళుకాని, దాతలుకాని లేకపోయారు. దాంతో స్వగ్రామంవిడిచి రాజమండ్రీ పొట్టపట్టుకు వచ్చాడు. అప్పటికి ఇంకా అతనిబాల్యం పరిసమాప్తి కాలేదు. చదువు ఎనిమిది పూర్తికాకముందే స్వస్తి చెప్పవలసి వచ్చింది. ఆ దుస్థితిలో ఆదరించి అభిమానించినవాడు యీ భద్రయ్య సెట్టి. ఎనిమిది రూపాయలలో ప్రారంభమైన గుమస్తా జీవితం, పదిహేను చూస్తోంది. రెండు సంవత్సరాలక్రితం సెట్టి పూనుకుని పెళ్ళికూడా అయిందనిపించాడు. పండుగలకు అప్పుడప్పుడు పంచల చాపులు ఇస్తున్నాడు.

ఇటువంటి ఉపకారాలుఎన్నో సెట్టిచేస్తూ వున్నా, మళ్ళీ జీతం మూడు రూపాయలు పెంచమనటం బేసబబుగా వుందేమో అనిపించింది, జానకిరామయ్యకు. ఆరు మాసముల క్రితం భార్యకాపరానికిరావడానికిఒకచిన్న ఇల్లు, సామాను వగైరాలు కావలసివచ్చాయి. ఒకపొట్ట, రెండు పొట్టలు అయింది. ఎంత సెట్టీ, సెట్టికొడుకూ కనిపెట్టుతూఉన్నా, పైగా సొమ్మురూపంలో రాగికాణీ కిట్టే ఆధారం లేకపోయింది. ఇప్పుడైనా తరచు పస్తులు వుండటం మూలంగా కాని ఈ సాహసం చేయనే లేకపోయేవాడు.

కొట్టు మూసి ఇంటికి వెళ్లేముందు వీరభద్రయ్యసెట్టి కుమారుడు గోవిందసెట్టి, గుమస్తా జానకిరామయ్యను ప్రక్కగా పిలిచి, "మా బాబుతో ఏటండి! జీతమే పెంచాలి ఏటి పోనిద్దురూ, ఆమాత్రం మీకు కిట్టిస్తే చాలేటండి?" అని హామీఇచ్చాడు. దానితో రామయ్య మనస్సు కుదుటపడింది.

గోవిందసెట్టికి జానకిరామయ్య అంటే అవ్యాజమైన స్నేహభావం. ఇద్దరూ సుమారు ఒక వయస్సువారే. జానకిరామయ్య ముక్కుకు సూటిగా పోయేవాడనీ, ఎప్పుడూ వ్యాపారతరహాగా అన్నా అబద్ధం ఆడడనీ గోవిందసెట్టికి దృఢవిశ్వాసం. సినీమాలకు, హోటళ్ళకూ తరచు కలిసి వెళ్లుతూవుండేవారు. ఖర్చు అంతా సెట్టిదే. జానకిరామయ్య "తన కొట్లో గుమస్తా" అని ఏనాడో మరచిపోయాడు. మిత్రునకు ఇచ్చేగౌరవాలు అన్నీ ఇచ్చేవాడు. వీరభద్రయ్యసెట్టితో సహా అంతా, అతన్ని "గోవిందసెట్టి మంత్రి" అనేవారు.

ఆ మాసంలోనే కీర్తిశేషుడైన తన పినతండ్రి భార్య మరణించినట్లు జానకిరామయ్యకు స్వగ్రామంనుండి తంతివార్త వచ్చింది. వెంటనే భద్రయ్యసెట్టివద్ద సెలవు తీసుకుని స్వగ్రామం వెళ్లాడు. ఆ పినతల్లికి సంతానం లేకపోవటం మూలాన్న అంత్యక్రియలు అతనే జరుపవలసి వచ్చింది. అన్ని రోజులూ అక్కడేఉండి కర్మకాండ పూర్తిఅయిందనిపించాడు. ఆమె గతించటంవల్ల, ఆమె మనోవర్తిగా అనుభవిస్తూవుండేన నాలుగుఎకరముల భూమీ, స్వల్పంగా చరాస్తి సంప్రాప్తించాయి. ఉన్నరొఖ్ఖం నూటపదిరూపాయలూ, ఆ పన్నెండు రోజులలోను అయిన ఖర్చుకూ, గోదానమునకూ సరిపోయింది.

మరో రెండురోజులువుండి భూమిని అమ్మకం చూపించాడు. ఎకరం, అయిదు వందలదాకా ఇస్తామన్నారు. ఆరువందలు కావాలి అన్నాడు. ఎకరం ఒక్కంటికి, పాతికతక్కువ ఆరువందలకు ఎగ్రిమెంటు వ్రాసి, రిజిస్ట్రీకు ఒక నెలవరకు ఇచ్చి, రాజమండ్రీ తిరిగివచ్చాడు. అందు చేతనే అదృష్టం, ఆపదా చెప్పి రావంటారు!

జానకిరామయ్య ఒకందుకు మాత్రం ఖేదపడ్డాడు. తండ్రి, పేకాటలుఆడి, ఆస్తిపాడు చేసినందుకు నిందించాడు. ఇప్పుడు తను చేస్తూవున్నది ఏమిటి? కలలోకూడా అనుకోనని భూమికలియటంతో, తండ్రిలాగే అమ్మివేయువూవటం! తండ్రివలె తను వృథాగా పాడుచేయటంలేదనీ, ఆసొమ్ముతో వెలుగడించవచ్చుననీ అతనితృప్తి.

## స్వయంకృషి

నేను ఒక లాయరుదగ్గిర పని చేస్తున్నాను. ఒకవృద్ధుడు ఇక తను ఆట్టే రోజులు బ్రతకనని తెలుసుకుని వీలునామా రాయించడానికి మా లాయరును పిలిపించాడు. నేను సాక్షీగా లాయరుతో వెళ్ళాను.

"నా కుమారుడు జిమ్‌కు మూడువేల పౌనులు ఇస్తున్నాను. నా మరొక కుమారుడు జాన్‌కు ఒక మూడు వేల పౌనులు, నా కుమార్తె మేరీకి మరొక మూడు వేల పౌనులు ఇస్తున్నాను. నా మనుమలకు, మనుమరాళ్ళకు తలా ఒక మూడువందల పౌనులు ఇస్తున్నాను..." అని వృద్ధుడు ఇంకా చెప్పబోతున్నాడు. లాయరు ఆయన మాటకు అడ్డం వచ్చి "మిస్టర్ రాబర్ట్సు! మీ ఆస్తి అంతాకలిపినా వెయ్యిపౌనులకంటే ఎక్కువలేదు! మరి ఒక్కొక్కళ్ళకీ ఇంతంత డబ్బు ఇస్తున్నానని రాయిస్తున్నారు–ఇదంతా ఎక్కణ్ణించి వస్తుందని మీ ఊహ?" అని అడిగాడు.

వృద్ధుడు ముఖం కందగడ్డలా చేసుకుని లేచి కూర్చుని కోపంగా "ఎక్కణ్ణించా? ఏమో నాకేం తెలుసు? కష్టపడి సంపాయించుకోమనండి. నేను సంపాయించుకోలా? అలాగే!" అన్నాడు.

.ఎడ్వర్డ్ వాపిల్స్.

జానకిరామయ్య ఏమీ దాచకుండగా, నాలుగుఎకరములభూమి కలసినట్లూ, తను ఆభూమి అమ్మకమునకు ఎగ్రిమెంటు వ్రాసినట్లూ, వివరములతోసహా అన్నీ వీరభద్రయ్యసెట్టికి తెలిపాడు. ఆసొమ్ముతో, కొంత అనుభవంవుందికనుక చిల్లరకొట్టు వ్యాపారం పెట్టే అభిప్రాయంకూడా ఉన్నట్లు వ్యక్తపరిచాడు.

*　　*　　*

అంతా ఒకవారంలో వీరభద్రయ్యసెట్టి గృహంలో, స్వప్నంలోకూడా ఎవ్వరూఅనుకోనిమార్పు జరిగింది. జనానాలో పుట్టిన ఆ సుడిగాలి పెచ్చుపెరిగి మగవారిని కూడా తుడిచిపెట్టేసింది. ఇంట్లో సవతితల్లి మూలాన్న, తనకీ, భార్యకీ, పిల్లలకీ సరియైన జరుగుబాటు లేకుండా పోతోందనీ, సవతితల్లికీ, ఆమె పిల్లలకీ, ఆమె కోడలికీ ఎక్కువ సదుపాయాలు వీరభద్రయ్యసెట్టి చేస్తున్నాడనీ గోవిందసెట్టి ఆరోపణ.

తగవు పెద్దమనుష్యులవరకూ వెళ్లింది. దాని ఫలితంగా భద్రయ్యసెట్టి, తన ప్రథమ కళత్రం కుమారుడు గోవిందసెట్టికి మూడు వేల రూపాయల రొఖ్ఖం ఇచ్చేటట్టునూ, గోవిందసెట్టికి తండ్రి స్థిర, చరాస్తులలో కల సర్వహక్కులూ వదులుకునేటట్టునూ, పరిష్కారం జరిగింది.

ఈమధ్య జానకిరామయ్య స్వయంగా వ్యాపారం పెట్టతలచినట్లు అన్నమాటలకూ, కొడుకు గోవిందసెట్టి తనతో తగవు పడ్డానికీ ముడిపెట్టేడు భద్రయ్యసెట్టి. తనకొడుకునకు వేరుకావాలనే పాడుబుద్ధి స్వతహాగా పుట్టలేదనీ, దానికి గుమాస్తా ప్రేరేపణే కారణమనీ, నిందవేసేడు. మరునాడే జానకిరామయ్య గుమాస్తా ఉద్యోగానికి, ఉద్వాసన ఇచ్చేడుసెట్టి. "అన్నీ మనమేలుకొరకే!" అన్నాడు జానకిరామయ్య.

గోవిందసెట్టి ఇంటివద్ద పెట్టిన తగవుకి జానకిరామయ్య ఏ విధంగానూ బాధ్యుడు కాడు. తగవు పెద్ద మనుష్యుల చేతులలోనికి వెళ్ళిందాకా ఆ విషయం అతనికి తెలియనే తెలియదు.

ఒకమాసం తరువాత గోవిందసెట్టీ, జానకిరామయ్యా కలసి ఉమ్మడిగా వ్యాపారము పెట్టారు. కిరాణా కొట్టూ, కందులు, సెనగలు మొదలైన అపరాలూ, చింతపండూ టోకువర్తకం వాళ్ళది. వ్యాపారం చిరపరిచితమే కాబట్టి క్రొత్త లేకపోయింది వాటాదార్లకు. వ్యాపారం ఉమ్మడిగా పెటడంతో ప్రజలలో జానకిరామయ్యే, తండ్రీ కొడుకుల తగవుకు కారణభూతుడని నిర్ధారణ అయింది. అది ప్రమాదం లేని అపవాదుగా భావించాడు జానకిరామయ్య.

వ్యాపారం అమోఘంగా సాగింది. యుడం వాళ్ళకు కల్పవృక్షమయింది. తెలుపూ, నలుపుల సమ్మేళనతో వ్యాపారం ప్రారంభించిన పది సంవత్సరాల కల్లా బజారుకు సమీపంలో ఒక రెండు అంతస్తుల మేడ, పదివేల రూపాయల కిమ్మత్తుతో వుమ్మడిగా కొన్నారు. పెద్దలంతా కలసి ఏకగ్రీవంగా నిశ్చయించిన సుముహూర్తాన్న గృహప్రవేశం వైభవంగా జరిగింది. జానకిరామయ్యా, అతని సంసారం, తూర్పుభాగములో గోవిందసెట్టీ, అతని సంసారం పడమటి భాగంలోనూ దిగారు. మేడకు వెనుక భాగంలో వున్న షెడ్డులు, సరకుల నిల్వకు కేటాయించబడ్డాయి.



దీపావళి సరదా
—ఫొటో: [శ్రీపాద వెంకన్న.]

రాజమండ్రీలో జానకిరామయ్యకు, గోవిందసెట్టికీ, భద్రయ్యసెట్టికికూడా లేని పలుకుబడి వచ్చింది. నిజంగా వాళ్ళ పెట్టుబడుల సొమ్ము ఎంతో తెలియదు కాని, వ్యాపారం ఇరవై వేలతో సాగుతూఉన్నట్లు ప్రజా వాక్కు.

పుష్కరన్నర పైచిలుకుగా సాఫీగా పోతూవున్న వ్యాపారంలో ఇప్పుడు కొన్ని చెప్పుకోతగ్గ మార్పులువచ్చాయి. గోవిందశెట్టికి వుబ్బసంవ్యాధి మూలాన్న, చిల్లర కొట్టుమీద తరచు అతని కుమారుడు రాంబాబు కూర్చుంటున్నాడు. జానకిరామయ్య యథాప్రకారం టోకు వర్తకం ఖరీదులూ, అమ్మకాలూ చూస్తూవున్నాడు.

రాంబాబు చూస్తూ వున్న చిల్లరకొట్టు వ్యాపారంలో ఈమధ్య పెట్టుబడి అధికం అయినా, లాభములు మామూలుకన్నా తక్కువగా కనబడుతూన్నది.

రాంబాబు జమీందారీ ఖర్చునూ, పరివారాన్నీ చూసి, జానకిరామయ్యకు అనుమానం వేసిందంటే ఆశ్చర్యంలేదు. జానకిరామయ్య చూస్తూవుండగా నాలుగయిదు పర్యాయములు, రాంబాబు తనపేరని ఖర్చు వ్రాయకుండా సొమ్ము తీసుకోవటం జరిగింది. ఒకటి రెండురోజులు చూచి, రాంబాబు ఖర్చువ్రాయకపోవటంవల్ల, జానకిరామయ్యే ఆ సొమ్ముని రాంబాబుపేర గుమస్తాతో చెప్పి ఖర్చు వ్రాయించటమూ, తరువాత "మరచిపోయాను పని తొందరలో" అని రాంబాబు సర్దుకోవడమూ జరిగాయి.

"నిజంగా రాంబాబు మరచిపోయే ఖర్చు వ్రాయలేదా, లేక జ్ఞాపకం వుండే వ్రాయలేదా?" అనేది వేరే ప్రశ్న. జానకిరామయ్యకు మాత్రం వాడుకున్న సొమ్ము ఖర్చు వ్రాయటం మరచిపోవటం ఏమిటి అనిపించింది. ఎగవేసే కోరిక వుండే ఖర్చు వ్రాయలేదనే అతని అభిప్రాయం.

జానకిరామయ్య కుండబద్దలు కొట్టినట్లు మాటలాడే మనిషి. తోచింది, మంచి అయినా, చెడు అయినా ముఖంమీద అని వేయటమే!

జానకిరామయ్యకు పుటిండే బుద్ధిగా, ఒకరోజు గోవిందసెట్టిని ఏకాంతంగా కలిసిండే తడవుగా రాంబాబు విషయం ఎత్తాడు:

"చిల్లరకొట్టులో కొంతకాలంగా పెట్టుబడులు ఎక్కువ అయినా లాభంలు మామూలుగానన్నా రావటంలేదు."

"ఎంచేత ఏటండీ? కొట్టుమీద నేను కూచోడం లేదుకదా; అబ్బాయి మీరూ వుంటున్నాను."

తనకి నష్టం కలుగుతూ వున్నమాట ఎలాగువున్నా, మిత్రుడికి తెలిసిన విషయం చెప్పడం ముఖ్యంగా ఈ సందర్భంలో తన కనీస బాధ్యతగా గుర్తించి— "రాంబాబు విషయం నాకు ఏమీ నచ్చలేదు. అతను, అతని ఖర్చు అతని మిత్ర బృందం, అంతా." అన్నాడు జానకిరామయ్య.

"ఏటండి ! ఆడేంచేశాడు?"

"రాంబాబు ఖర్చుకి అంతూదరీ కనపడటంలేదు. అప్పుడప్పుడు కొట్లో ఖర్చు వ్రాయకుండా కూడా సొమ్ము నాలుగూ, అయిదూ వాడుకోటం చూచాను. రాంబాబుతో చెప్పేను కూడా. "మరచిపోయాను" అంటాడు. నా పరోక్షంలో ఎన్నిసారులు వాడుకుంటున్నాడో ఎవరు చూడవచ్చారు? అంతా అంతే అయితే ఉమ్మడి వ్యాపారంచేసి, వాటాదారులు మట్టి తినవసినదే! ఎందుకొచ్చిన వ్యాపారం, కొట్టుమూసి, ఇంటివద్ద పరుంటే నయం, ఉన్నది అన్నా మిగులుతుంది." అని ఒక చదువు యథాశక్తి చదివాడు.

మాటలాడటం కూడా ఒకకళే. తూచి

# ★ ప్రకృతి పరిష్కారం ★

మాటలాడటానికి నేర్పు కావాలి. మానసికంగా కలిగిన వైపరీత్యములు మాటలుగా బహిర్గతము కాకుండా పట్టి, మాటలాడ గలగటం ఎక్కడో! అందులో జానకిరామయ్య వంటి నూటికినూరు పాళ్ళూ ఆత్మవిశ్వాసం కల వ్యక్తితూచి మాటలాడలేదంటే, కించ కానీ, కినుక కాని మనం వహించవలసిన అవసరం లేదు.

కొందరు వ్యాపారస్థులలాగనే గోవిందసెట్టి, స్నేహపాత్రుడు అయినా అనుమానస్థుడు. పట్టుదల విషయంలో "తాపట్టిన కుందేటికి మూడేకాళ్ళు" అనే రకం.

టోకు వర్తకం ఖరీదులలో జానకిరామయ్య అసలు ధరలు కప్పిపుచ్చి దొంగ ధరలు చూపించి, డబ్బు మిగుల్చుకుంటున్నాడని గోవిందసెట్టికి కొంతకాలంగా అనుమానంగా వుంది. ఒకటి, రెండు పర్యాయములు ఖరీదుల విషయంలో అతను అడిగిన ప్రశ్నలకు జానకిరామయ్య అన్యమనస్కుడై వుండి, తడుముకుని, డొంకతిరుగుడుగా ఇచ్చిన జవాబులు అతని అనుమానాలని బలపరిచాయి. "చేపనయ్య కబుర్లకు పడిపోయి నమ్మేత్తాననుకుంటున్నాడు. చెప్పనీ, టైము రాక పోద్దేటి?" అనుకునేవాడు అలాంటి సమయాలలో తను కొట్టుమీద వుండకపోవటం, వుండే రాంబాబుకి వ్యాపారం సరిగా తెలియకపోవటం, జానకిరామయ్య చేసే మాయకి వీలు ఇస్తున్నాయని సెట్టి నమ్మకం.

రాంబాబు, గోవిందసెట్టికి ఏకైక పుత్రుడు. అందులోనూ ప్రప్రథముడు. తండ్రికి ప్రథముడు అంటే అభిమానం అంటారు. సెట్టికి రాంబాబు ఖర్చు పెట్టుతున్నాడు అంటే సంతోషం. "ఎప్పుడను భవించినా ఆడు అనుభవించవలసిందె కదేటండీ?" అంటూ వుంటాడు. ఉమ్మడి వ్యాపారంలో సొమ్ము వాటాదారుకు తెలియకుండా అపహరిస్తున్నాడు అనటం కంటె వేరేనింద ఏమికావాలి? అందులోనూ తను పెద్ద నిజాయితీ కలవాడిలా ఎదుటివాళ్ళని తీసేస్తున్నాడు. మంచి అదను దొరకింది, అనుకున్నాడు గోవిందసెట్టి.

"పాపం! ఆడికి సరకు ఖరీదుల్లో కమీషనూ, ఇంకా, ఇంకా..., కిట్టటంలేదు కాబోసు. ఏం చేత్తాడు?, దొంగసొమ్ము తినకపోతే! అమ్మ, బాబా ఆడికి ఇయ్యటానికి," అన్నాడు సెట్టి జ్వలిస్తూవున్న కోపాన్ని ఎదురువత్తి పొడుపులతో అణచుకోవటానికి ప్రయత్నంచేస్తూ.

జానకిరామయ్యకు సెట్టి మాటలలో విపరీతార్థం వున్నట్లు తోచలేదు. "ఖరీదులు నేను చూస్తున్నా కాబట్టె కాని లేకపోతేనా?"

అంతతో వదల తలచుకోలేదు సెట్టి—"ఎట్టా, అంచేతే ఆడికి పైగా సొమ్ము ముట్టక దొంగసొమ్ము తింటేగాని గడవదు; ఏం చేత్తాడు?" అని దీర్ఘాలతో తన అభిప్రాయం (జానకిరామయ్య కమీషనులు తింటూవున్నట్లు) వ్యక్తమయ్యేలాగున అన్నాడు.

గోవిందసెట్టి మాటలలో ఉన్న వ్యంగ్యార్థం ఇప్పుడు అర్థం అయింది జానకిరామయ్యకు.—"ఏమిటి! అయితే నేను సరకు ఖరీదులలో సొమ్ము మిగుల్చుకుంటున్నాను. అనేగా నీ వుద్దేశం? రాంబాబు విషయం, వ్యాపారంలో వాటాదారుని కాబట్టే, నీ స్నేహితుణ్ణి కాబట్టే, అభిమానం కొద్దీ అన్నాను. మన స్నేహాన్ని అన్నా పాటించకుండా, నీ ఇష్టం వచ్చినట్లు పరియాచకాలు ఆడితే పడటానికి ఎవ్వరూ లేరు?" అన్నాడు ఎప్పుడో కాని కోపంరాని సాత్వికులకు కోపం వచ్చిన తీవ్రతతో.

జానకిరామయ్య కొంతసేపటిక్రిందదాకా సెట్టికి ప్రాణ స్నేహితుడు. ఇంతలోనే ఎంతమార్పు! శరీరమే క్షణభంగురము; మరి స్నేహం ఎందుకు అవకుండా పోతుంది.? చంచల లక్ష్మి అన్నింటికీ కారణభూతం!

సెట్టికనులు ఎర్రపడ్డాయి. పళ్లు పటపటలాడాయి. కోపంతో కంపించి పోయాడు. ఏదో మాటలాడటానికి ప్రయత్నించాడు. కాని మాటలు మనసులోనే కరిగి, ఇగిరిపోయాయి. అంతట్లోనే తలవని తలంపుగా, అప్రయత్నంగా జిహ్వాగహ్వరంలోనుండి, అక్షర కవాటాలను తోసుకుని, దూసుకుని—అగ్నిపర్వతం ప్రేలినట్లు—.

"అవును. దొంగతనం కటటం అభిమానం కదేటి మరి? ఎవళ్లిదాకా వత్తేకాని ఆళ్లకి తెలియదు. ఆడిపోషన అంతా మీరే చూత్తూన్నట్టు, ఎందుకొచ్చిన మాటలు? అభిమానం అంట అభిమానం. మీకు నష్టం కలుగుతావుందని చెప్పకూడదూ? ఆడు నా తరపు మనిషి అయ్యాక ఆడినడం ఒకటే, నన్ననటం ఒకటేటి? ఈయాల ఆడినన్నావు రేపు నేను ఆడిని నీకు తెలియకుండా సొమ్ము తీయమంటున్నానంటావు. ఏటి నరంలేని నాలిక్కా?" అనివేసి చటనలేచి వెళ్ళిపోయాడు ఒగర్చుకుంటూ.

జానకిరామయ్యకు ఒళ్ళు ఎండిన తాటి ఆకుల మంటలా రపరపలాడింది. ఇన్నాళ్లు తను ప్రాణ మిత్రుడు అనుకుంటూ వున్న సెట్టి తనగుణం పోనిచ్చుకోలేదు. తన మనస్సు తెలుసుకోలేకపోయాడు. రాంబాబు మున్ముందు భ్రష్టుడయితే అతనికే తెలుస్తుంది. మంచికి పోతే నిష్ఠూరం ఎదురైందట! కోపంవస్తే ఎవరికి భయం? అతని అంతటి వాడు అతనూ, నా అంతటి వాడను నేనూ" అనుకున్నాడు.

ఆ సాయంకాలం రాంబాబు వచ్చి, జానకిరామయ్యను కొట్టేటంత దూకుడుగా నానా అవాచ్యములూ ఆడి వెళ్లిపోయాడు. జానకిరామయ్యకు మాటలాడటం చేతకాదట

(56 వ పేజీ చూడండి)


## మూత్రంలో చక్కెర పోతున్నదా?

మూత్రంలో చక్కెరపోవడం చాలా ప్రమాదకరం. అతి క్లిష్టమైన వ్యాధి శరీరంలో పాతుకొనిపోయి, బలపడి క్రమేపి రోగిని మృత్యువాత పెడుతుంది. ఈ వ్యాధి తగిలిన రోగుల సంఖ్య రోజుకు రోజు వృద్ధియగుచున్నది. ఈ రోగ లక్షణాలు ఏవంటే. అమిత దాహం, ఆకలి, తరచుగా మూత్రవిసర్జనం, మూత్రంలో చక్కెర, దురద మొదలైనవి. ఈ జబ్బు కనపడిన తరువాత వెంటనే దానికి చికిత్సచేయక పోయేటట్లయితే, రాచపుండు, వ్రణములు, కంటిపొర, అతిసారం, శరీరమంతా నొప్పులు, కీళ్ళవాతం రక్తపోటు, క్షయ, బరువు తగ్గుదల, అతి ప్రమాదకరమైన తదితర వ్యాధులు బయలుదేరుతవి. "వీనస్ చారమ్" బిళ్ళలు పూర్వకాలం నాటి యూనాని వైద్యశాస్త్రం ప్రకారం తయారు చేయబడ్డవి. ఇందులో అరుదైన వనమూలికలు, సారములు చేర్చబడినవి. ఇవి వెంటనే గుణమిచ్చి పై లక్షణాలను పారద్రోలుతవి. "వీనస్ చారమ్" బిళ్ళలువాడి వేలాది మంది మృత్యుముఖం నుంచి తప్పించుకొన్నారు. మూత్రంలో చక్కెర, తరచుగా మూత్ర విసర్జనం, ఈ చికిత్స మొదలుపెట్టిన 2 వ లేదా 3 వ రోజునుంచే తగ్గుముఖం పడతవి, కొన్ని రోజులకే మీకు స్వస్థత కలుగుతుంది. "వీనస్ చారమ్" ఎక్కువ ఖరీదుకాదు. నిరపాయమైనది. సేవించడం సులభం. ప్రత్యేకపత్య నిర్బంధములులేవు. అడిగిన వారికి పూర్తివివరాలు ఇంగ్లీషులో పంపబడతవి. 50 బిళ్ళల డబ్బీ ఖరీదు రు. 6-12-0 ప్యాకింగు పోస్టేజి ఉచితం.

వివరములకు :

వీనస్ రీసర్చి లేబరేటరి, (A. P. W.)

పో. బా. నం 587. కలకత్తా.

# ప్రకృతి పరిష్కారం

(??వ పేజీ తరువాయి)

కట్టి వదరుబోతట; వడిమంతరంగా డబ్బు వచ్చేప్పటికి కన్నూ, మిన్నూ కనపడటం లేదుట—ఇంకా ఏమేమో అన్నాడు.

రెండురోజులలో వ్యాపారాలు విడిపోయాయి. టోకు వర్తకం జానకిరామయ్య వాటాకు వచ్చింది. చిల్లరకొట్టు గోవిందసెట్టి వాటాకు వచ్చింది. కొంత సొమ్ము ముజరాలు చూసుకున్నారు.

జానకిరామయ్య అంటే గోవిందసెట్టి భార్యకు అభిమానం అని పురప్రముఖులు తరచు అనుకుంటూ వుండటం వుంది. అది పసికట్టబట్టే గోవిందసెట్టిలో యీ మార్పు, త్వరలో వచ్చిందంటారు అయినా విశ్వసనీయమైన హేతువులు ఏమీ లేకపోవటం వల్ల అది అపవాదు అయివుండవచ్చు.

వ్యాపారములు విడిన కొద్దిరోజులలో జానకిరామయ్య, గోవిందసెట్టి వాటాకూ, తనవాటాకు మధ్య పెద్దగోడ కట్టేనిమిత్తం పునాది తీయించాడు. ఆ మరునాడు కోర్టునుండి పని ఆపవలసిందిగా ఉత్తరువు వచ్చింది తరువాత గోవిందసెట్టి వద్దనుండి, ఉమ్మడి వ్యాపారంమీద వచ్చిన లాభములతో కొనిన మేడ కనుక, ఆ వ్యాపారముల వాటాల నిష్పత్తిప్రకారం తనకు మేడలో పదిఅణాల ఏనిమిదిపైసాల వాటా రావలసివుందనీ, అది ఇవ్వనిపక్షంలో కోర్టుకెక్కవలసి వస్తుందనీ, ఖర్చులు ఇయ్యవలసివుంటుందనీ నోటీసు వచ్చింది. మేడ ఇరువురి పేర్లను కొననది కాని, వ్యాపారములోని వాటాలప్రకారం కాదనీ, అందుచేత తనకు చెరిసగం వాటా ఉందనీ, తక్కిన సంప్రదాయములతో, తిరిగి నోటీసు పంపేడు జానకిరామయ్య.

ఆ దావా విచారణకు హైకోర్టుదాక వెళ్ళటానికి మూడు సంవత్సరములు పట్టింది. క్రింది రెండు కోర్టులలోనూ జానకిరామయ్యే నెగ్గాడు. గోవిందసెట్టి పట్టుదల వదలలేదు. ప్లీడర్ల, రాజీచేసే ప్రయత్నం నీరుకారింది.

ఈ మూడు సంవత్సరములలోనూ, రాజమండ్రిలో పెద్దమనుష్యులకూ, ప్లీడర్లకూ బాగా పనితగిలింది. జానకిరామయ్య ఇంటి వాటాలోని వాడకంనీరు, గోవిందసెట్టి వాటాలోనికి వస్తోంది. అని ఒకదావా, జానకిరామయ్య నోటికి ఇవం వచ్చినటూ నిందిస్తున్నాడని పరువునష్టం దావా, ఇంకా ఇటువంటివి సెట్టిచేసినవి ఎన్నో దావాలు! దాంతో క్రిమినల్ కోర్టుకూ, మునిసిపల్ కోర్టుకూ, సివిల్ కోర్టుకూ, బెంచికోర్టుకూ, అన్నింటికీ పనితగిలింది. జడ్జీల తీర్పులు తీర్పులలాగే ఉన్నాయి. అపీళ్ళు, కొత్త తగవులు వస్తూనే వున్నాయి.

ప్రాణస్నేహం ఎక్కడో అక్కడే బద్ధవైరం!

*  *  *

అది ప్రకృతికి ఆగ్రహం కలిగిన సమయం—

అవి జలప్రళయం సంభవించిన రోజులు:

రాజమండ్రీ రైలు వంతెనవద్ద గోదావరి నది నీటిమట్టం అరవైఅయిదు అడుగులు దాటింది అంటే దాటింది అన్నారు! పురంలో కొన్ని పేటలు ఖాళీ చేయవలసిందిగా గవర్నమెంటు వారి ఉత్తరువు.

ఆనాటి కాళరాత్రి ఆగ్రహం కలిగి, కట్టలు తెంచుకున్న గోదావరీమతల్లి "మీ కట్టలు నాకు చెలియలి కట్టలు" అన్నట్లు తక్కిన గ్రామాలవలెనే రాజమండ్రీని కూడా కబళింప చూసింది. రాజమండ్రీలో అనేక ప్రాంతములు నీటిమయం అయ్యాయి. ఇళ్ళూ, మేడలూ, నురగలు గక్కే నదిలో చిన్నచిన్న లంకలలా పొడచూపాయి!

ప్రాణములు అరచేతుల్లో పట్టుకుని మెరకలు చేరిన ప్రజానీకం—

ఊరు ఊరంతా గగ్గోలు!...

తిండికి తల్లుల ముఖాలు చూచి ఏడ్చే పిల్లలు—

సహనమే తమధర్మం అన్నట్టు దీనంగా పతులవైపు చూచే సతులు—

"ఇల్లూ! సామాను! దూడలూ!" అంటూ తలలుపట్టుకు కూర్చున్న పురుషులు—

"ఇదే మంచిసమయం, మించిన దొరకదు" అనే దుండగీడులు!—వారికి "ఉన్నాం జాగ్రత్త!" అని హెచ్చరిస్తూ, "మీకూ, మీ సామానుకూ ఏవిధమైన భయం లేదు" అని ప్రజలకు అభయహస్తం చూపించే దేశభటులు—

కట్టు కంచలకు కట్టిన కన్నాలువిప్పే దారులు లేక రొదచేసే పశుసంతతి—

అంతా!—అన్నీ!

ఇంకా:

నానిన గోడలనూ, మేడలనూ వడ్రంతో కుత్సిత బుద్ధితో శృంఖలాలు తెంచుకున్న తుమ్మలాము క్రందుంగలు—

ఆ వాడలలో నాటి భీభత్సనాట్యం—

నది తగ్గకముందే బజారు మెరకలమీద చేరిన జనం, గోవిందసెట్టి, జానకిరామయ్యల మేడ, సరుకు నిల్వచేసిన షెడ్డులూ, కూలేయి అంటే కూలేయి అన్నారు!

"ప్రకృతిచేసిన పరిష్కారం!"

"ప్రకృతి ఇచ్చిన తీర్పు!"

"పాపం! నోసటిప్రాత, ఎవరు తప్పించగలరు!"

"నలుగురితో పాటు నారాయణ!"

"అంతా దైవకృప!"

అవీ లోకంలోని మాటలు.

ధనం కూడవేస్తే స్వప్రయోజకత్వం! పోతే దైవకృప!

భగవంతుడిమీద అభాండం!

అసలు కీలకం కాలంచేతుల్లో కీలుబొమ్మ మానవుడు.

ప్రాణంపోసేది కాలం! తీసేది కాలం!—

ధనం ఇచ్చేది కాలం! బికారిని చేసేది కాలం!—

కాలంతో బుద్ధి మార్పులు! కాలంతో పరిస్థితి తేడాలు!—

కాలం లోహపు కౌగిలిలో జడపదార్థం మానవుడు!—

అనంతకాలప్రవాహంలో మానవుడు ఒక బుద్బుదం!!

కేవలం నిమిత్తమాత్రుడు!

అదే కాలం నేర్పేపాఠం! గుణపాఠం!

యుగయుగాల చరిత్రలు చాటే సత్యం!

★







అన్ని వ్యాధులకు
నరముల బలహీనత, తలదిమ్ము, మలబద్ధమునకు, చెడురక్తము మొదలైన వ్యాధులకు ఆతంక నిగ్రహ మాత్రలనే వాడుడు.
మంచిగుణము నిచ్చేమందు 32 మాత్రలు గల డబ్బీ వెల 1/4
ఆతంక నిగ్రహ ఫార్మసి.
26, బ్రాడ్వే, మద్రాసు.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd by S Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street Madras-1 Editor S Sambhu Prasad